ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -90 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 12 ఏప్రిల్ 2026

# ముగిసిన అమెరికా-ఇరాన్ తొలిదశ చర్చలు

## ఇరాన్ ఆస్తుల విడుదలకు అంగీకారం?

### లెబనాన్ విషయంలో అస్పష్టత




**ఇస్లామాబాద్ : ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

అమెరికా–ఇరాన్‌ల మధ్య పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన తొలిదశ చర్చలు ముగిశాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ చర్చల ప్రక్రియ రాత్రి పది గంటల వరకు కొనసాగింది. ఉదయం నుండి దఫాల వారీగా ఈ చర్చలు జరిగాయి. రాత్రి భోజనం తరువాత కూడా చర్చలు కొనసాగుతాయని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, భోజనం తరువాత ఉదయం నుండి ఏకాభిప్రాయానికి వచ్చిన అంశాల వివరాలకు సంబంధించిన సమాచార పత్రాలను ఇరు దేశాల బృందాలు పరస్పరం మార్చుకుని,చర్చల ప్రకియను ముగించాయి. ఉదయం వేరువేరు గదుల్లో ఉండి పాకిస్తాన్ అధికారుల మధ్య వర్తిత్వంతో చర్చలను జరిపిన ఇరు దేశాల బృందాలు మధ్యాహ్నం నుండి ముఖాముఖి సమావేశమయ్యాయి.

మిగతా 2లో.

# సంక్షేమం లక్ష్యంగా ముందుకు...



## టీడీపీ క్యాడర్ తో చంద్రబాబు కాఫీ కబుర్లు..

- క్లీన్ పాలిటిక్స్..పాజిటివ్ ఓటింగ్
- ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి
- కార్యకర్తల కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్
- శిక్షణా తరగతుల్లో టిడిపి అధినేత చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

పాజిటివ్ ఓటు పెరగాలని, క్లీన్ పాలిటిక్స్ మన లక్ష్యమని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. జగన్ మావిగన్ విమర్శలకు అమరావతి అభివృద్దే సరైన సమాధానం ఇస్తుంది. పిచ్చిపట్టినట్లు చేసే

మిగతా 2లో.

# మోడీ నోట మళ్లీ యుసిసి మాట!

-అధికారంలోకి వస్తే బెంగాల్‌లో అమలు చేస్తాం

-ఎన్నికల సభలో ప్రకటన



**జంగీపూర్ : ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడి మరోసారి విద్వేష రాజకీయాలకు తెరతీశారు. ఎన్నికలలో లబ్ధి పొందడమే లక్ష్యంగా యూనిఫాం సివిల్‌కోడ్ (యుసిసిసి) అంశాన్ని ప్రస్తావించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని జంగీపూర్‌లో శనివారం జరిగిన ర్యాలీలో మోడీ పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ

మిగతా 2లో.

# మోదీ, రాహుల్ సంభాషణ..

- పార్లమెంటు ప్రాంగణంలో అరుదైన దృశ్యం..
- మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి
- పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్ వద్ద నివాళి కార్యక్రమం
- కాసేపు పలు విషయాలపై మాట్లాడుకున్న మోదీ, రాహుల్



**న్యూఢిల్లీ : ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

దేశ రాజకీయాల్లో ఉప్పు- నిప్పులా ఉండే ప్రధానమంత్రి మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈరోజు మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ లోని 'ప్రేరణ స్థల్' వద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పూలే విగ్రహానికి నివాళు లర్పించగా... అనంతరం ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

మిగతా 2లో.

# న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగింది

## హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి




# ప్రేమోన్మాదిపై పోలీసుల కాల్పులు




- కడప జిల్లాలో కలకలం...
- ఖాజీపేట విద్యార్థిని హత్య కేసు నిందితుడిపై కాల్పులు
- పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించిన వెంకటేశ్
- నిందితుడి దాడిలో ఇద్దరు పోలీసులకు గాయాలు
- మోకాలి కింద కాల్పులు జరిపిన సీఐ వంశీధర్

# వేసవి సెలవుల్లో విద్యార్థులకు డ్రై రేషన్

## సీమ జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు ప్రాధాన్యం



**అమరావతి, ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో వేసవి సెలవుల కారణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోకుండా, కూటమి ప్రభుత్వం 'డ్రై రేషన్' పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులు వేసవి సెలవుల్లో పౌష్టికాహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏపీ కూటమి ప్రభుత్వం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. సాధారణంగా పాఠశాలలు ఉన్నప్పుడు మధ్యాహ్న భోజనం అందుతుంది,

మిగతా 2లో.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి




**హైదరాబాద్, ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**

కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు.

మిగతా 2లో.

# నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జనసేన నేత జి.వి.ఎన్. ప్రసాద్ చారిత్రక విజయం.

**..హర్షం వ్యక్తం చేసిన జనసేన నాయకులు దండు మురళీకృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:** నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ క్రియాశీల సభ్యుడు జి.వి.ఎన్. ప్రసాద్ ప్రభంజనం సృష్టించారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ ఎన్నికల్లో ఆయన తన ప్రత్యర్థి జి. రాంప్రసాద్‌పై 261 ఓట్ల భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. బార్ అసోసియేషన్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 90 శాతం పోలింగ్ నమోదు కావడం, అత్యధిక మెజార్టీతో ప్రసాద్ విజయం సాధించడం విశేషం.జి.వి.ఎన్. ప్రసాద్ ఘనవిజయం పట్ల నంద్యాల జనసేన పార్టీ నాయకులు దండు మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, న్యాయవాదుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తిని బార్ అసోసియేషన్ సభ్యులు గుర్తించి ఏకపక్ష తీర్పు ఇచ్చారని కొనియాడారు. ఈ విజయం జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని ఆయన పేర్కొన్నారు.

# గోవిందపల్లేలో కత్తిపోటు కలకలం

**కుటుంబ కలహాలతో మామ, భార్యపై అల్లుడు దాడి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 11:**
సిరివెళ్ల మండలం గోవిందపల్లే గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం కుటుంబ కలహాలు రక్తపాతానికి దారి తీశాయి. కుటుంబ విభేదాల నేపథ్యంలో అల్లుడు చంద్రశేఖర్ కత్తితో దాడి చేయగా, ఇట్టే వెంకటేశ్వర్లు మరియు అతని కుమార్తె సంజమ్మ గాయపడ్డారు.
స్థానికుల సమాచారం మేరకు, కుటుంబ వ్యవహారాలపై ఏర్పడిన వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో చంద్రశేఖర్ ఆగ్రహంతో కత్తితో దాడి చేశాడు. దాడిలో వెంకటేశ్వర్లు, సంజమ్మలకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మరియు స్థానికులు వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సంఘటనపై సిరివెళ్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి గల పూర్తి కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది.

# నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.వి.ఎన్. ప్రసాద్ ఘనవిజయం

**చరిత్రలో నిలిచిపోయేలా భారీ పోలింగ్.. ఏకపక్షంగా సాగిన తీర్పు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:** నంద్యాల కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన నాలుగు ప్రధాన పోస్టుల ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా, రసవత్తరంగా సాగాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఏకంగా 90 శాతం పోలింగ్ నమోదైంది. నంద్యాల బార్ అసోసియేషన్ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో పోలింగ్ జరగడం ఇదే ప్రథమమని ఎన్నికల అధికారులు వెల్లడించారు. సాయంత్రం వెలువడిన ఫలితాల్లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన జి.వి.ఎన్. ప్రసాద్ తన ప్రత్యర్థి జి. రాంప్రసాద్‌పై 261 ఓట్ల భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించి సత్తా చాటారు. మొత్తం 460 ఓట్లు పోల్ అవ్వగా, మెజారిటీ స్థానాల్లో విజేతలు ఏకపక్ష మెజార్టీలతో దూసుకుపోయారు. కోశాధికారి పదవికి జరిగిన పోటీలో ఎం. కృపావతి తన సమీప ప్రత్యర్థి ఏ. శ్రీదేవిపై 201 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించగా, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ నూర్ అల్లం ఖాద్రి తన ప్రత్యర్థి డి. చిన్న లింగమయ్యపై 238 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. లైబ్రరీ సెక్రెటరీ స్థానానికి జరిగిన హోరాహోరీ పోరులో మద్దిలేటి తన ప్రత్యర్థి సి. కేసన్నపై 211 ఓట్ల మెజార్టీతో విజేతగా నిలిచారు. ఎన్నికల అధికారులుగా హుస్సేన్ భాష, తిరుపతి, ఎం.ఆర్. కృష్ణారెడ్డి, తాలంకి వెంకటప్రసాద్, కృష్ణ లింగమయ్య వ్యవహరించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా న్యాయవాదులందరూ ఐకమత్యం చాటారని, ఈ విజయం న్యాయవాద కుటుంబానిదేనని అభ్యర్థులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు తోటి న్యాయవాదులు పూలమాలలతో ఘనస్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే కు ఘనంగా నివాళులర్పించిన దళిత బహుజనులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 11:**
మహాత్మా జ్యోతిరావు పూలే కు ఘనంగా నివాళులర్పించిన దళితులు. జయంతోత్సవం స్థానిక నంద్యాలలోని పద్మావతి నగర్ నందు ఘనంగా జరిగింది. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవములో దళిత బహుజన నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే కు ఘనంగా నివాళులర్పించడం జరిగినది. ఘనంగా నివాళులర్పించిన వారిలో మేకల లింగస్వామి జిల్లా అధ్యక్షులు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా, మరియు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి,జిల్లెల్ల శ్రీరాములు తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏ.సి. వెంకటసుబ్బయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నులక చందనము లక్ష్మన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు, సుబ్బరాయుడు బహుజన పార్టీ రాష్ట్ర నాయకులు, దండోరా నాయకులు గంటల గిరి, సునీల్, ప్రముఖ పాత్రికేయుడు మేకల వెంకట్, కడియం అనిల్ కుమార్ దేవ నగర్, వెంకటేశ్వర్లు మొదలగువారు మహాత్మ జ్యోతిరావుపూలే కు ఘనంగా నివాళులర్పించడం జరిగినది.మహాత్మా జ్యోతిరావు పూలే ఘన నివాళి సందర్భముగా మేకల లింగస్వామి జిల్లా అధ్యక్షులు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మరియు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపన్యసిస్తూ ఏప్రిల్ మాసం అన్నది ముగ్గురి సామాజిక విప్లవకారులకు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు బాపు జగ్జీవన్ రామ్ లకు జన్మనిచ్చిన మాసమని , అందులో మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల బానిసత్వ శృంకలాల ను తెంచి, నిర్మూలించిన మహోన్నతుడని, భారతీయతలో వెళ్లునుకొన్న కుల రక్కసిని అధః పాతాళానికి అణగద్రొక్కిన మహోన్నత మూర్తి అని, కుల వివక్షత లేని నవ సమాజ నిర్మాణానికి కంకణం కట్టుకున్నన నిబద్దికుడు అని, సామాజిక సమానత్వము సమ సమాజ న్యాయానికి వన్నెతెచ్చిన వీరోచిత సామాజిక విప్లవ యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని చెప్పక తప్పదు.మరి ముఖ్యంగా జిల్లెల్ల శ్రీరాములు తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , ఏ. సి.వెంకటసుబ్బయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మరియు ములకచందనం లక్ష్మన్న ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు తమదైన శైలిలో మాట్లాడుతూ విద్యే ధ్యేయంగా మహిళా సాధికారతకు జీవము పోశాడని అందుకే ఆ మహాత్మునికి ఘనంగా నివాళులు అర్పించి స్మరించుకోవడం మన బాధ్యతని, తరతరాలకు సామాజిక స్పృహ కు చిహ్నామని , భావితరాల బడుగు బలహీన వర్గాలకు ఆశా ద్వీపమని కొనియాడడం జరిగినది. మేకల లింగస్వామి జిల్లా అధ్యక్షులు రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా & రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శితదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్.

**..ఆపరేషన్ వజ్రప్రహార్"లో విస్తృత తనిఖీలు 48 వాహనాలు స్వాధీనం.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఏప్రిల్ 11:**
జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా శనివారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ఈగల్ ఐజి ఏకే రవి కృష్ణ పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగాయి.జిల్లాలోని అన్ని పోలీసు సబ్ డివిజన్‌ల పరిధిలో ఈ ఆపరేషన్ చేపట్టగా, పత్తికొండ సబ్ డివిజన్‌లో తుగ్గలి మండలం రామళ్ళ గ్రామం, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో కడివెళ్ళ గ్రామం, ఆదోని సబ్ డివిజన్‌లో ఆదోని పట్టణం, కర్నూలు సబ్ డివిజన్‌లో కర్నూలు నగరం మరియు బి. తాండ్రపాడు గ్రామం, టీవీ9 కాలనీలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా చేపట్టిన ఈ తనిఖీలలో డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు సహా మొత్తం 240 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సుమారు 2 వేల మంది వ్యక్తులను, 400 వాహనాలను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 48 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
అలాగే మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పోలీసులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు.
ఇలాంటి దాడులు "ఆపరేషన్ వజ్రప్రహార్"లో భాగంగా నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య, ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాంకో సిమెంట్ కాలుష్య బాధితులను ఆదుకోవాలి.

**..మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో సిపిఐ బృందం చర్చలు. -..సమస్యల పరిష్కారానికి మూడు రోజుల గడువు కోరిన మంత్రి.**






**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఏప్రిల్ 11:**
నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వెదజల్లుతున్న కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర, జిల్లా ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బనగానపల్లెలోని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి. కే రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. ప్రతినిధి బృందంఆయనను కలిసి రైతుల గోడును వివరించారు. గత కొన్నేళ్లుగా ఫ్యాక్టరీ కాలుష్యం కారణంగా వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో కొంతకాలంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 10న ఫ్యాక్టరీ ముట్టడికి పిలుపునివ్వగా, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ జోక్యం చేసుకున్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని ఎస్పీ సూచించడంతో ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేసి, నేడు మంత్రిని కలవడం జరిగింది. కొలిమి గుండ్ల మండలంలోని రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల నష్టపోయినరైతుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని రైతులకు నష్టపరిహారం అందించే విషయమై ఫ్యాక్టరీ యాజమాన్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఆర్డీఓ, కలెక్టర్‌తో చర్చించి, రెండు మూడు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి తమకు మూడు రోజుల గడువు కావాలని ఆయన కోరారు.
అనంతరం బనగానపల్లెలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడారు. కొలిమిగుండ్ల మండలంలోని 18 గ్రామాల రైతులు ఈ కాలుష్యం వల్ల బతుకుదెరువు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ సమావేశములో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. సుంకయ్య, కే. భాస్కర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ. సుబ్బారెడ్డి, మండల కార్యదర్శి శివయ్య, సీనియర్ నాయకులు సంజీవులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే గారి సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**
ద





**ఆంధ్ర ప్రగతి డోన్ ఏప్రిల్ 11:**
డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో జ్యోతి మిత్రమండలి అధ్యక్షుడు యు. శ్రీనివాసులు అధ్యక్షతనశ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సుంకన్న, హోంగార్డు ఎం. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జ్యోతి మిత్రమండలి అధ్యక్షుడు యు. శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ లిమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన మహానుభావుడు.
శ్రీ జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11 జన్మించారు.మన భారతీయ సామాజిక సంఘ సంస్కర్త మరియు మహారాష్ట్రకు చెందిన రచయిత.సమాజంలోని సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా కృషి చేసిన మహనీయులు జ్యోతిరావ్ పూలే.ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడు. 1873 సెప్టెంబరు 24న పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశాడు.ఈయన మరియు ఈయన భార్య సావిత్రీబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848 లో పూనాలో ప్రారంభించారు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి భారతీయులలో ఈ జంట ఉన్నారు. మన భారత ప్రథమ సామాజిక తత్వవేత్త అయిన పూలే గారు 1890 నవంబర్ 28 స్వర్గస్తులైనారు.ఇటువంటి మహానుభావుల అడుగుజాడల్లో నడవాలని జ్యోతి మిత్రమండలి అధ్యక్షుడు యు. శ్రీనివాసులు, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

## కుటుంబ కలహాలు హింసకు దారి.. తండ్రి, కూతురిపై అల్లుడు కత్తితో దాడి.



**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల ఏప్రిల్ 11:** శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో కుటుంబ కలహాలు తీవ్రరూపం దాల్చి దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఇట్టే వెంకటేశ్వర్లు మరియు ఆయన కుమార్తె సంజమ్మపై అల్లుడు చంద్రశేఖర్ కత్తితో దాడి చేసినట్లు సమాచారం.ఈ ఘటనలో వెంకటేశ్వర్లు, సంజమ్మలకు గాయాలు కావడంతో వెంటనే వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది.ఈ ఘటనపై సిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూధన్ తెలిపారు. కుటుంబ వివాదాలే ఈ దాడికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘన నివాళి అర్పించిన కాంగ్రెస్ నాయకులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 11:** భారతదేశం తొలి ఉద్యమకారుడు, సామాజిక విప్లవ జ్యోతి, అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని నేడు దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని పద్మావతి నగర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే గ్రహానికి పూలమాల వేసిమహాత్మా జ్యోతిరావు పూలే కి జై భారత్ మాతాకీ జై, జై భారత్, జోహార్ మహాత్మా జ్యోతిరావు పూలే అంటూ నినాదాలతో ఘనమైన నివాళి అర్పించి నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే భారత దేశపు గొప్ప సంఘసంస్కర్త, తత్వవేత్త, రచయిత, విద్యావేత్త, సామాజిక విప్లవ జ్యోతి అంటూ కొనియాడారు మహాత్మ జ్యోతిరావు పూలే 1827 మహారాష్ట్రలో జన్మించారు మహాత్మా జ్యోతిరావు పూలే తన భార్య శ్రీమతి సావిత్రిబాయి పూలే తో కలిసి మహిళా విద్య కోసం బాలికల కోసం 1848లో పాఠశాలను స్థాపించారు భార్యాభర్తలిద్దరూ 1873లో సత్యశోధక సమాజ్ స్థాపించి బడుగు బలహీన వర్గాల కోసం మహిళల కోసం ప్రజల కోసం సమాన హక్కుల కోసం విద్య కోసం తమ సంపదను తమ జీవితాలను అంకితం చేసిన గొప్ప సంస్కర్తలైన వారిని సేవా నిరతిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వవలసిందిగా కోరుకుంటూ వారికి ఇష్టమైన విద్య, సమాజ సేవ కు నేటి విద్యార్థులు యువకులు ఆదర్శంగా తీసుకుని ఆచరణ దిశగా దేశ ఖ్యాతిని ప్రపంచ స్థాయికి చాటి చెప్పాలని కోరారు బాలికల విద్య కోసం వితంతువుల పునర్వివాహ కోసం మహిళ సాధికారత కోసం చేసిన సేవ మహోన్నతమైనదని విద్యార్థులు గుర్తించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య సీనియర్ మైనార్టీ నాయకులు అహ్మద్ భాషా, హుస్సేన్ భాష, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు ఫూలే సేవలు చిరస్మరణీయం.

**విద్యతో నే సమాజ మార్పు సాధ్యం. -కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు.**

**..సమాజ శ్రేయస్సు కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జ్యోతి రావు ఫూలే.**

**అక్షరాస్యత పెంపు, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి అవసరం.-జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ ఏప్రిల్11**

జ్యోతిరావు ఫూలే సేవలు చిరస్మరణీయం , విద్యతోనే సమాజ మార్పు సాధ్యం మని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఫూలే జన్మదిన సందర్భంగా పేర్కొన్నారు.
శనివారం నగరంలోని జ్యోతి రావు ఫూలే 200వ జయంతి సందర్భంగా బిర్లా గేట్ సర్కిల్లో జ్యోతి రావు ఫూలే విగ్రహానికి కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పాణ్యం శాసన సభ్యులు గౌరు చరితా రెడ్డి, బి.సి, వివిధ సంఘ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించి , అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన సభలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ...సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు ఫూలే సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. మూఢనమ్మకాలు ఎక్కువగా ఉన్న కాలంలో జన్మించిన ఫూలే వాటి నిర్మూలన కోసం విద్యను ఆయుధంగా ఎంచుకుని సమాజ మార్పుకు కృషి చేశారని ఆయన అన్నారు. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి ఫూలే గారు నిలిచారని గుర్తుచేస్తూ, మహిళా విద్యకు వారు చేసిన సేవలు అపారమని తెలిపారు. విద్య ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయడమే కాకుండా, వితంతువులకు ఆశ్రయం కల్పించడం వంటి సంస్కరణాత్మక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఫూలే ఆశయాలను అందరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. విద్యతోనే వ్యక్తి మరియు సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని కోరారు . బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తనకు ఎంపీగా అవకాశం కల్పించడం జరిగింది. రాబోయే ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో పార్లమెంట్ లో మహిళా బిల్లు ఆమోదం పొందుతుంది అన్నారు. రాష్ట్రం లో పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశముందని, అందులో మహిళలకు ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పారు. అలాగే శాసనసభ





సీట్లు కూడా పెరుగనున్నాయని వెల్లడించారు. ఐక్యతతో ఉంటేనే బిసి సమాజ అభివృద్ధి సాధ్యమని, బీసీల సాధికారత కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బీసీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, ఎన్టీ రామారావు ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కర్నూలులో బీసీ భవనం ఏర్పాటు చేయాలని సూచిస్తూ, మంత్రి టీజీ భరత్ గుప్తా రూ.1 కోటి నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతం ఉన్న బిసి భవన్ కొరకు ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎమ్మిగనూరులో వాల్మీకి భవన్‌కు రూ.25 లక్షలు, ఆదోనిలో రాజక కార్పొరేషన్ భవన్‌కు రూ.15 లక్షలు, కురవ భవన్‌కు రూ.1 కోటి, ఎమ్మిగనూరులో చేనేతల అభివృద్ధికి రూ.1 కోటి ఎం పి నిధులు కేటాయించినట్లు వివరించారు.బీసీలు మరింత చైతన్యవంతులు కావాలని, వివిధ కుల వృత్తులకు పనిముట్లు అందించే కార్యక్రమాలు త్వరలో అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు అన్నారు.కార్పొరేషన్లకు నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. త్వరలోనే బీసీ రక్షణ చట్టం అమల్లోకి రానుందని పేర్కొంటూ, సమాజంలో సమానత్వం, న్యాయం సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించిన ఫూలే గారు 1890 వరకు సమాజ హితానికి నిరంతరం కృషి చేస్తూ, మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం గొప్ప పోరాటం సాగించారని తెలిపారు. మహిళలపై ఉన్న వివక్షను తొలగించడానికి, వారికి విద్యాబోధన అందించేందుకు ఆయన జీవితాంతం చేసిన కృషి అపూర్వమని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే వివాహం చేసుకున్నప్పటికీ తన భార్య సావిత్రిబాయి ఫూలే గారికి చదువు నేర్పించి, ఆమె ద్వారా సమాజంలోని మహిళలకు విద్య అందించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. అప్పటి కాలంలో బిసి మరియు నిమ్నజాతులలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండేదని, ఆ పరిస్థితిని మార్చేందుకు ఫూలే విశేష కృషి చేశారని తెలిపారు. బాల్య వివాహాలు, కుల వివక్షత వంటి సామాజిక సమస్యలపై ఆయన చేసిన పోరాటం ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో అక్షరాస్యత శాతం కేవలం 57 శాతం మాత్రమే ఉండగా, మహిళల అక్షరాస్యత 37 శాతం మాత్రమే ఉండటం ఆందోళనకరమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. 150 సంవత్సరాల క్రితం ప్రారంభమైన విద్యా ఉద్యమం ఉన్నప్పటికీ, ఇప్పటికీ సమాజంలో పూర్తిస్థాయి మార్పు రావాల్సి ఉందని సూచించారు. ప్రత్యేకంగా జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఇంకా బాల్య వివాహాలు, అక్షరాస్యత లోపం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని, వీటిని నిర్మూలించడానికి స్థానిక నాయకులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.
అదేవిధంగా గతంలో వితంతువులకు విద్యను అందించడం ద్వారా సమాజంలో గౌరవం కల్పించాలనే ఫూలే ఆశయాన్ని నేటి తరము కొనసాగించాలని తెలిపారు. బాల్య వయస్సులో వివాహాలు చేయకుండా, పిల్లలకు మంచి విద్య అందిస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిని ప్రసూన మాట్లాడుతూ... ఎంపీ నాగరాజు కేటాయించిన కోటి రూపాయల నిధులతో జిల్లాలోని 20 బీసీ హాస్టల్లో మరమ్మత్తులు చేయించగలిగామని వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని తెలియజేశారు.
తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ...జిల్లాలో బీసీలకు ఉన్న సమస్యలను నాయకులందరూ కలిసి ఒక పద్ధతి ప్రకారం పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. వారికి సరియైన విద్య అందించడం , బాల్య వివాహాలను అరికట్టడం మరియు వారి అభివృద్ధికి బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పించడం వంటి కార్యక్రమాలకు కృషి చేయాలని సూచించారు...జ్యోతిబాఫూలే వేషధారుడు అరవింద్ అందరినీ ఆకర్షించాడు.బిసి పాఠశాల విద్యార్థినులు జ్యోతి బా ఫూలే పై ప్రదర్శించిన నృత్య రూపకం సభికుల ను ఆకర్శించింది. ఈ సమావేశం లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని ప్రసూన, బిసి ఈడి జాకిర్



హుస్సేన్ , జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ , కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప , బి సి నాయకులు నక్కమిట్టల శ్రీనివాసులు , కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప , బిసి సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మా , డైరెక్టర్ లు కురువ కార్పొరేషన్ పర్ల శ్రీను,వాల్మీకి కార్పొరేషన్ మంజునాథ్,నాయీ కార్పొరేషన్ విజయకుమార్,నాయకులు మురళి,రెడ్డి పోగు రాజకుమార్,రామకృష్ణ,వడ్డెర సంఘం చంద్రిక, శకుంతలమ్మ , ఉల్చాల లక్ష్మీనారాయణ, ధనుంజయ ఆచార్య, బీజేపీ లక్ష్మీకాంతన్న, శాలివాహన సంఘం నాగన్న, మురళి, బాలసంజన్న, వాడాల నాగరాజు, బిసి సంఘం కన్వీనర్ నాగేష్ ,శాలివాహన మధు,మొదలగు సంఘాల నాయకులు సభను ఉద్దేశించి ఫూలే గురించి ప్రసంగించి పాల్గొన్నారు.

# 111 మంది రైతులకు డీ-నోటిఫై పత్రాలు.

## కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ.

**దీర్ఘకాల భూ సమస్యలకు పరిష్కారం.**

**నంద్యాలలో ప్రత్యేక డ్రైవ్ ఫలితం.**

**చుక్కల, 22ఏ భూముల సమస్యలకు క్లియర్ గ్రీన్ సిగ్నల్.**

**మీ భూమి మీ హక్కు' లక్ష్యంతో ముందుకు జిల్లా యంత్రాంగం.**

**ప్రతి 15 రోజులకు భూ సమస్యల పరిష్కారం - కలెక్టర్ హామీ.**

**పారదర్శకంగా డీ-నోటిఫికేషన్ ప్రక్రియ.**

**రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం - జిల్లా పరిపాలనకు ప్రజల ప్రశంసలు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:**

జిల్లాలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములు, 22ఏ-1 నిషేధిత జాబితా భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ 111 మంది రైతులకు డీ-నోటిఫికేషన్ క్లియరెన్స్ పత్రాలను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు ఈ పత్రాలను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, మండల తాసిల్దార్ లు, రైతులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూములు, 22 ఏ1 భూములు నిషేధిత జాబితాలో వుండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 111 మంది రైతులకు డీనోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి సుమారు 400 మంది ప్రజలు హాజరవుతుండగా, అందులో 90 శాతం సమస్యలు భూములకు సంబంధించినవేనని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోవడం, తప్పుగా ఇతరుల పేర్లు నమోదు కావడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. తహసీల్దార్లు రికార్డింగ్ అధికారులుగా మాత్రమే వ్యవహరిస్తారని, భూమి యాజమాన్యాన్ని నిర్ణయించే అధికారం వారికి లేదని స్పష్టం చేశారు. నమోదైన డాక్యుమెంట్లు, భూమిపై ఉన్న అనుభవం (పొజెషన్) ఆధారంగా నిజమైన హక్కుదారుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం వారి బాధ్యత అని వివరించారు. జిల్లాలో భూవివాదాలకు ప్రధాన కారణాలు కుటుంబ తగాదాలు, ప్రభుత్వ భూములపై అక్రమ క్రయవిక్రయాలు అని కలెక్టర్ పేర్కొన్నారు. అసైన్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేయడం, అమ్మడం వంటి చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, ఇప్పటికే బనగానపల్లిలో జరిగిన ఇలాంటి అక్రమ విక్రయాలను రద్దు చేసినట్లు తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు వంటి ప్రకృతి వనరులు సామాజిక ఆస్తి అని, వాటిని ఆక్రమించకుండా సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి వనరులు అందించాలంటే ఇవి రక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రెవెన్యూ నిర్ణయాలపై అసంతృప్తి ఉన్న వారు తహసీల్దార్ స్థాయి తర్వాత ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చని, అనంతరం జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్ పిటిషన్ వేయవచ్చని, చివరికి హైకోర్టును ఆశ్రయించే అవకాశమూ ఉందని తెలిపారు. చుక్కల భూముల సమస్యకు చారిత్రక నేపథ్యం బ్రిటీష్ కాలంలో సర్వే సమయంలో పట్టాదారు వివరాలు లేని భూములకు 'చుక్కలు' గుర్తులు పెట్టడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయని కలెక్టర్ వివరించారు. ఈ భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2017లో డాటెడ్ ల్యాండ్స్ రెగ్యులరైజేషన్ చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం 2005కు ముందు నుంచి సాగులో ఉన్న లేదా అధీనంలో ఉన్న భూములను గుర్తించి అర్హులకు పట్టాదారు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోందని వివరించారు.

### పెండింగ్ కేసులకు వేగవంత పరిష్కారం

జిల్లాలో సుమారు 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, అందులో 111 కేసులను పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. మరో 280 ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఒకే సర్వే నంబరులో ఉన్న భూములను సబ్‌డివిజన్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ వీఆర్వో లాగిన్‌లో అప్లోడ్ అయిన దరఖాస్తులను తహసీల్దార్ స్థాయిలో త్వరితంగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 29 వేల ఎకరాలకు సంబంధించిన 26 వేల మంది పట్టాదారుల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నామని




తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కొన్ని దరఖాస్తులు వాగు పోరంబోకు భూములు ఆక్రమించడం, కోర్టు వివాదాలు ఉండడం వంటి కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు.

### పారదర్శకత అవినీతి నిరోధం

డీ-నోటిఫికేషన్ ప్రక్రియలో ఎవరైనా డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన తర్వాతే ఆదేశాలు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు.

### రైతుల సంతృప్తి

ఒక రైతు తన 49 ఎకరాల భూమి సమస్యను కేవలం 6 నెలల్లో పరిష్కరించుకున్నట్లు పేర్కొంటూ, సాధారణంగా సంవత్సరాలు పట్టే సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు.భవిష్యత్ లక్ష్యాలు, మిగిలిన కేసులను వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఖరీఫ్ సీజన్ నాటికి రైతులు తమ భూములపై పూర్తి హక్కులు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు "మీ భూమి మీ హక్కు" కింద స్పష్టమైన పత్రాలు అందజేయడం లక్ష్యమని పేర్కొన్నారు. పాస్ పుస్తకాలలో తప్పులు ఉంటే సవరణ మాడ్యూల్ ద్వారా సరిదిద్ది రైతులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 111 మంది రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా డీ-నోటిఫై పత్రాలు అందచేశారు.

# కొత్తూరు లో మార్కాపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రత్యేక పూజలు..!

**..ఆలయ ప్రధానార్చకులు కంపమల సురేష్ శర్మ.**



**ఆంధ్ర ప్రగతి ఎస్.కొత్తూరు/ పాణ్యం ఏప్రిల్ 11:**

ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమును మార్కాపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బాలాజీ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామక్రిష్ణ, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు పూలమాలలు, శాలువాలు, శేష వస్త్రముతో ఘనంగా సత్కరించి, ఆశీర్వదించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# 8 మంది గంజాయి విక్రేతలు అరెస్ట్.

**..3 కిలోల గంజాయి స్వాధీనం.కర్నూల్ నాలుగో పట్టణ సిఐ విక్రమ సింహ.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ ఏప్రిల్ 11:**



గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ రోజు కర్నూల్ టౌన్‌లోని వీకర్ సెక్షన్ కాలనీలో రెండు ట్యాంకుల సమీపంలో దాడులు నిర్వహించారు.ఈ దాడిని 4వ పట్టణ సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో, కల్లూరు తహసీల్దార్ శ్రీ ఆంజనేయులు, వీఆర్ఓలు, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై గోపీనాథ్ మరియు పోలీసు సిబ్బంది కలిసి నిర్వహించారు.ఈ దాడులలో నందికొట్కూరు నివాసి అక్బర్ (గత మూడు నెలలుగా చెన్నమ్మ సర్కిల్‌లో నివసిస్తున్నాడు) ఒడిశా రాష్ట్రానికి చెందిన రంజిత్ అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు 3 కిలోల గంజాయి కొనుగోలు చేసి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు.ఈ క్రమంలో క్షత్రియబాగ్‌కు చెందిన తెలుగు సాయి, బంగారుపేటకు చెందిన షికారి చరణ్,వాల్మీకి శ్రీనివాసులు, మునగాలపాడు గ్రామానికి చెందిన మల్లెపోగుజయసింహ, ఆరోరా నగర్‌కు చెందిన పెద్ద రంగస్వామి, శ్రీరామ్ నగర్‌కు చెందిన మౌళి కిషోర్, శాంతి వర్ధన్ లు కలిసి గంజాయిని విక్రయించేందుకు భాగాలుగా పంచుకుంటున్న సమయంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి మొత్తం 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడమైనది.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# జిమ్‌కు వెళ్తే జీవితం బాగుపడుతుంది.. ఇది నిజం.!





**షేక్. ఖాజా మొహిద్దీన్**
హెల్త్ & ఫిట్నెస్ కోచ్ నంద్యాల
నంద్యాల జిల్లా సెక్రటరీ
న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 11:**
నేటి ఆధునిక కాలం(5జి యుగం) లో మనిషి కి అన్నింటిని సులువుగా అందుబాటులో తెచ్చుకున్నాడో, అంతే అందుబాటులో ఊబకాయం , కొలెస్ట్రాల్, డయాబెటిస్, బీపీ, గుండె జబ్బులు వంటి అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నాడు నేటి మానవుడు. నేటి ఆధునిక కాలంలో ప్రతి మనిషి ఎంత బిజి లైఫ్ లో జీవిస్తున్నాడో తెలుసా విందు వినోదాలకు, విలాసాలకు, సమయం కేటాయించడం కనీసం తాను ఏమి తింటున్నాడు ఏమి తాగుతున్నాడు, వీటి వల్ల భవిష్యత్తు లో ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి అని ఆలోచించే టైమ్ లేని స్థితిలో ఉంటున్నాడు. డబ్బు ఖర్చు పెట్టి మరియు అనారోగ్యము కొని తెచ్చుకుని ఈ రోజు మనతో ఉన్న వాడు అర్ధంతరంగా అందరిని విడి శాశ్వితంగా తిరిగిరాని లోకానికి వెళ్ళిపోతున్నాడు. అందుకే తన ఆరోగ్యం కోసం తాను ప్రతి రోజూ ఒక గంట సేపు వ్యాయామం,నడక, జాగింగ్ , సమయం లేని వారు హోమ్ వర్కవుట్ అయిన ,చేయడం నేటి కాలంలో మానవునికిచాలా అత్యంత అవసరం. ఆరోగ్యము గా ఉంటూ సంతోషముగా జీవనం సాగించడం వలన మనిషి జీవితం సంపూర్ణంగా, ఆనందంగా జీవిస్తాడు. జిమ్ లో మీరు చేరడానికి పెట్టే ఖర్చు ఆరోగ్యానికి తప్ప అనారోగ్యానికి కాదు కదా, ఈ రోజు ఆరోగ్యం కోసం ఖర్చు పెడితే రేపటి కాలంలో హాస్పటల్ లో ఖర్చు పెట్టే అవసరం ఉండదు, మీ జీవితమంతా మీ చేతుల్లోనే ఉంది .ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టడానికి ఆలోచించే మనిషి, అనారోగ్యము పాలు అయితే మాత్రం హాస్పటల్ బిల్లు ఎంత ఖర్చు అయినా అప్పు చేసి మరి ప్రాణం కాపాడు కోడానికి ఖర్చు పెడతాడు.
పక్కకు మనిషి తన ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ఫిట్నెస్ మరియు హెల్తీ లైఫ్ కోసం జిమ్ లో చేరితే అనేక ప్రయోజనాలు ఉన్నాయి.
జిమ్లో బరువులెత్తడానికి శక్తి మీకు కావాలి కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటారు. అలాంటి ఆహారం వల్ల చక్కగా నిద్రపడుతుంది. దానివల్ల మరుసటి రోజు ఉత్సాహంగా పని చేస్తారు.
దాంతో మీలో ఆత్మవిశ్వాసం పెరిగి జీవితంలో రాణిస్తారు. దానివల్ల మీ జీవితం అన్ని విధాలుగా బాగుంటుంది. అందుకే జిమ్కు డుమ్మా కొట్టకండి. ప్రతి రోజూ వ్యాయామం చేయండి. ఆరోగ్యమతంగా జీవించండి.అప్పుడు మీకు డయాబెటిస్, కొలెస్ట్రాల్, ఒబేసిటీ,వంటి సమస్యలను మీ శరీరం దరి చేరనివ్వదు. ఎందుకంటే ఆరోగ్యమే మహా భాగ్యము కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై దృష్టి ఉంచి ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కునేందుకు తప్పనిసరిగా జిమ్ కు వెళ్లాలని తెలిపారు.నేటి యువత చేజేతులా నాశనం చేసుకుంటోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'గంటల తరబడి కూర్చొని పని చేయడం, జంక్ ఫుడ్, ఒత్తిడి తగ్గాలని స్మోకింగ్, నిద్ర కోసం మద్యం సేవించడం ప్రాణాంతకం. సంపూర్ణమైన జీవితం గడపాలంటే తక్షణమే జీవనశైలి మార్చుకుంటూ. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని హెల్త్ మరియు ఫిట్నెస్ కోచ్ షేక్ ఖాజా మొహిద్దిన్ తెలిపారు.'.

**1. రోజుకు ఒక కొబ్బరికాయ న్యూరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
మెదడు ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు నరాల క్షీణత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**2. రోజుకు ఒక వాల్‌నట్ సైకియాట్రిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
ఒమేగా-3లు పుష్కలంగా ఉంటాయి, ఆందోళన, నిరాశను తగ్గించడంలో సహాయపడతాయి మరియు మానసిక స్థితికి తోడ్పడతాయి.

**3. రోజుకు ఒక ఉసిరికాయ ఇమ్యునాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది.

**4. రోజుకు ఒక అరటిపండు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
జీర్ణక్రియకు తోడ్పడుతుంది, ఎసిడిటీని తగ్గిస్తుంది మరియు ప్రేగులకు ఉపశమనం కలిగిస్తుంది.

**5. రోజుకు ఒక అంజీర్ పండు ఎండోక్రినాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది మరియు హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుంది.

**6. రోజుకు ఒక ఖర్జూరం హెమటాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
ఐరన్ అధికంగా ఉంటుంది, రక్తహీనత మరియు అలసటను నివారించడంలో సహాయపడుతుంది.

**7. రోజుకు ఒక దానిమ్మ పండు కార్డియాలజిస్ట్‌ను దూరంగా ఉంచుతుంది.**
గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది మరియు రక్తపోటును తగ్గిస్తుంది.

**8. రోజుకు ఒక పిస్తా తింటే యూరాలజిస్ట్ అవసరం ఉండదు.**
మూత్రపిండాల పనితీరుకు మద్దతు ఇస్తుంది మరియు మూత్రాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**9. రోజుకు గుప్పెడు బాదం పప్పులు తింటే చర్మవ్యాధి నిపుణుడి అవసరం ఉండదు.**
విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, చర్మ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది మరియు పొడిబారడాన్ని నివారిస్తుంది.

**10. రోజుకు ఒక బొప్పాయి తింటే కాలేయ నిపుణుడి అవసరం ఉండదు.**
కాలేయ నిర్విషీకరణకు మద్దతు ఇస్తుంది మరియు జీర్ణక్రియ, కొవ్వు జీవక్రియకు సహాయపడుతుంది.
పైన తెలిపిన ఆరోగ్య సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో వినియోగించుకొని సంపూర్ణ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని
న్యూ బాడీ లైన్ జిమ్ అధినేత షేక్ ఖాజా మొహీనుద్దీన్ తెలిపారు.

---

# పూలే ఆశయాలు ఆచరణలో పెట్టాలి

**మంత్రి ఎన్ఎండీ ఫరూక్.**
**నంద్యాలలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు.**
**సామాజిక సమానత్వానికి పూలే చూపిన మార్గం స్ఫూర్తిదాయకం.**
**బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి.**
**పుస్తక పఠనం ద్వారా నాయకత్వ లక్షణాల వికాసం -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:**
సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహాత్మ జ్యోతిరావు పూలే గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ ఆర్చ్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొని పూలే విగ్రహానికి పుష్పమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జయంతోత్సవ సభను మంత్రి, కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ మాట్లాడుతూ పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణలకు పునాది వేసిన మహానుభావుడని పేర్కొన్నారు. కుల, మత వివక్షలను ఎదుర్కొంటూ సమాన హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన సాధనమని పూలే గారు చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ, సామాజిక సంస్కరణలను ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ముఖ్యంగా మహిళల సాధికారతకు తీసుకున్న చర్యలు, వెనుకబడిన వర్గాలకు కల్పించిన అవకాశాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. మైనారిటీల కోసం గురుకుల విద్యా సంస్థలు, ఆరోగ్య సదుపాయాల విస్తరణ వంటి కార్యక్రమాలు సామాజిక న్యాయానికి దారితీసినవని వివరించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. స్త్రీ విద్య ప్రాధాన్యతను ఆయన ఎంతో ముందుగానే గుర్తించి, తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో ఆడపిల్లల కోసం పాఠశాలలను స్థాపించడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. "ఒక మహిళ చదువుకుంటే ఒక కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది" అనే భావనను ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యలు ఇంకా కొంతవరకు కొనసాగుతున్నాయన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళలను కనీసం డిగ్రీ స్థాయి వరకు చదివించి, వారు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా నిలబడేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. జ్యోతిబా పూలే పేరుతో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రీ మరియు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ద్వారా వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. అదేవిధంగా బాలికల విద్యాభివృద్ధి కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూల్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని వివరించారు. విద్యార్థుల పోషణ కోసం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం', అవసరమైన విద్యాసామగ్రి కోసం 'విద్యార్థి మిత్ర' పథకం అమలు అవుతున్నాయని తెలిపారు. డిజిటల్ బోధన విధానాల ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పుస్తక పఠనం అలవాటు ద్వారా జ్ఞానం పెరగడంతో పాటు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని, యువత దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు.
జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం సామాజిక న్యాయం కోసం సాగిన నిరంతర పోరాటానికి ప్రతీక అని అన్నారు. బాల్య వివాహాలు, కుల అసమానతలు, వితంతు వివాహాల నిషేధం వంటి అనేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం సమాజాన్ని మార్పు దిశగా నడిపించిందన్నారు. ఈ మార్పుకు మూలం విద్య మరియు చైతన్యమేనని, భావితరాలకు ఈ విలువలను చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు రమణయ్య గౌడ్, జిల్లెల్ల శ్రీనివాసులు, బాలస్వామి, నాగశేషుడు, సుధాకర్, రామచంద్రరావు, కొమ్ము పాలెం శ్రీనివాసులు, వేణుగోపాల్ నాయుడు తదితరులు జ్యోతిరావు పూలేను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.









---

# పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన.

**- కలెక్టర్ రాజకుమారి పిలుపు. -పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు కీలకం - కలెక్టర్.**
**స్క్రీన్ టైమ్ తగ్గించి ఆటలు, పుస్తక పఠనం పెంచాలి.**
**మహిళా, శిశు అభివృద్ధి అధికారులకు ఓరియంటేషన్ ట్రైనింగ్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 11:**
జిల్లాలో ఈ నెల 23వ తేదీ వరకు పోషణ్ పక్వాడా ద్వారా ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళా మరియు శిశు అభివృద్ధి, సాధికారత శాఖలో పనిచేస్తున్న అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "పోషణ్ పక్వాడా" 8వ ఎడిషన్ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ వరకు సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాలు పడుతున్నాయని ఆమె హెచ్చరించారు. అధిక ఉప్పు, సోడియం కలిగిన ఆహారం వల్ల రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండ సమస్యలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అలాగే జంక్ ఫుడ్ వల్ల ఖాళీ కేలరీలు అధికంగా శరీరంలో చేరి ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. పీచు పదార్థాల లోపం కారణంగా జీర్ణక్రియ సమస్యలు, మలబద్ధకం వంటి ఇబ్బందులు వస్తాయని, సహజమైన పండ్లు, కూరగాయలు, పోషకాహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అదనపు చక్కెరలు, ప్రిజర్వేటివ్స్ ఉన్న ఆహారం పిల్లల్లో ప్రవర్తనా సమస్యలు, ఏకాగ్రత లోపం, అతి చురుకుదనం వంటి సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. మన సంప్రదాయ ఆహారం ఆరోగ్యానికి బలమని, స్థానిక ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పిల్లల అభివృద్ధిలో తొలి రెండేళ్లు అత్యంత కీలకమని, ఈ సమయంలోనే 80 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని ఆమె వివరించారు. చిన్నారులకు చక్కెర వినియోగాన్ని తగ్గించడం, మొబైల్ ఫోన్లు, టీవీ స్క్రీన్‌లను దూరంగా ఉంచడం అత్యంత అవసరమని చెప్పారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల నిద్రలేమి, కంటి సమస్యలు, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య పోషకాహారం, క్రమబద్ధమైన ఆటలు, కుటుంబంతో గడిపే సమయం కీలకమని పేర్కొన్నారు. ఇంటి లోపల, బయట ఆటలు ఆడేలా ప్రోత్సహించడం ద్వారా శారీరక, సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి అలవాట్లు పిల్లల్లో ఊహాశక్తి, సృజనాత్మకతను పెంపొందిస్తాయని, భాషా నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. పెద్దలతో సమయం గడపడం ద్వారా కుటుంబ బంధాలు బలపడటమే కాకుండా సంప్రదాయాలు తదుపరి తరాలకు చేరుతాయని పేర్కొన్నారు. పిల్లల శ్రేయస్సు కోసం ఇప్పటి నుంచే సరైన నిర్ణయాలు తీసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అధికారి లీలావతి మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారి లీలావతి, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పరివర్తన లైఫ్ సెంటర్లో..హెచ్ఐవి దంపతుల ఆదర్శ వివాహం.

## ముఖ్యఅతిథిగా హాజరైన వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు అమీర్ దంపతులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 11:**
నంద్యాల పట్టణంలో మానవత్వానికి నిదర్శనంగా నిలిచే ఓ విశేషమైన కార్యక్రమం ఘనంగా జరిగింది. హెచ్ఐవి బాధితుల ఆదర్శ వివాహం సమాజానికి సానుకూల సందేశాన్ని అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంది.నంద్యాల పట్టణంలోని ఎస్సార్ బీసీ కాలనీలో ఉన్న పరివర్తన్ లైఫ్ సెంటర్లో హెచ్ఐవి బాధితుల ఆదర్శ వివాహం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యూపీ నరసింహ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించడం విశేషం. సమాజంలో హెచ్ఐవి బాధితులపై ఉన్న అపోహలను తొలగించడంతో పాటు, వారికి సమాన గౌరవం, హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ వివాహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ఆదర్శ వివాహ వేడుకకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై,




నూతన వధూవరులను ఆశీర్వదించారు.
ఈ వేడుకకు పెళ్లిపెద్దగా వైఎస్సార్‌సీపీ నాయకులు దాల్ మిల్ అమీర్ తన సతీమణితో కలిసి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు సమాజంలో చైతన్యం అవసరాన్ని నొక్కి చెప్పారు."సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, హక్కులు ఉండాలి. HIV బాధితులను కూడా సమానంగా చూడాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి ఆదర్శ వివాహాలు సమాజంలో ఉన్న అపోహలను తొలగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, భవిష్యత్తులో మరింతగా ఇటువంటి కార్యక్రమాలు జరగాలని ప్రజలు ఆశిస్తున్నారు.మొత్తానికి, నంద్యాలలో జరిగిన ఈ ఆదర్శ వివాహం మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తూ, సమాజానికి గొప్ప సందేశాన్ని అందించింది.

# సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

**-నంద్యాలలో 17 నుంచి 19 వరకు నిర్వహణ**
**-వాల్‌పోస్టర్ ఆవిష్కరణ**

**నంద్యాల ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**
నంద్యాల జిల్లాలో తొలిసారిగా ఈ నెల 17, 18, 19వ తేదీల్లో నిర్వహించనున్న సిఐటియు 17వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. శనివారం నంద్యాలలోని సిఐటియు కార్యాలయంలో మహాసభ వాల్ పోస్టర్‌ను యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను, హక్కులను హరించివేస్తోందని వివరించారు. భూములను, రాష్ట్ర సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు, స్కీమ్ వర్కర్ల, కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. మహాసభలో గత కార్మిక పోరాటాల విజయాలను సమీక్షించుకుంటామని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. 17న నంద్యాల




మున్సిపల్ టౌన్ హాలులో భారీ బహిరంగ సభ, ఎన్‌జిఒ కాలనీలోని కో-ఆపరేటివ్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరగనుందని తెలిపారు. సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎలమరం కరీం, ఉపాధ్యక్షులు కె.హేమలత, కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తదితరులు హాజరవుతారన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

**15 నుండి 17 వరకు శ్రామికోత్సవాలు**
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ మహాసభను పురస్కరించుకొని ఈ నెల 15 నుండి 17 వరకు నంద్యాల మున్సిపల్ టౌన్ హాలులో శ్రామికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అభ్యుదయ కళాకారులు, వాగ్గేయకారులు ఈ సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దర్శనం లక్ష్మణ్, నిర్మల, కెఎండి గౌస్, వెంకట లింగం, తోట మద్దులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించి విజయవంతంగా భూమికి చేరిన 'ఆర్టెమిస్-2'

**ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**
అర్ధ శతాబ్దానికి పైగా నిరీక్షణకు తెరదించుతూ, మానవాళి మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా ప్రయోగించిన ఆర్టెమిస్-2 యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న నలుగురు వ్యోమగాములు భూమికి సురక్షితంగా తిరిగొచ్చారు. వారి ఒరైన్ క్యాప్సూల్ 'ఇంటెగ్రిటీ' పసిఫిక్ మహా సముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ అయింది. కమాండర్ రీడ్ వైస్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, కెనడాకు చెందిన జెరెమీ హాన్సెన్‌లతో కూడిన ఈ బృందం దాదాపు 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి వచ్చింది.భూ వాతావరణంలోకి ప్రవేశించే ఘట్టం అత్యంత ఉత్కంఠభరితంగా సాగింది. ధ్వని వేగం కన్నా 33 రెట్లు అధిక వేగంతో క్యాప్సూల్ భూమి వైపు దూసుకొచ్చింది. అపోలో యాత్రల తర్వాత ఇంతటి వేగంతో వ్యోమనౌక భూమిని చేరడం ఇదే తొలిసారి. వాతావరణంలోకి ప్రవేశించాక, వేలాది డిగ్రీల ఉష్ణోగ్రత నుంచి క్యాప్సూల్‌ను రక్షించే హీట్ షీల్డ్ పనితీరుపైనే అందరి దృష్టి నిలిచింది. ఈ సమయంలో దాదాపు ఆరు నిమిషాల పాటు మిషన్ కంట్రోల్‌కు, వ్యోమగాములకు మధ్య కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయింది. ఆ తర్వాత పారాచూట్లు తెరుచుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శాన్ డియాగో తీరంలో సిద్ధంగా ఉన్న యూఎస్ఎస్ జాన్ పి. ముర్తా నౌక సిబ్బంది వ్యోమగాములను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

# హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

## కాల్పులవిరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

**న్యూఢిల్లీ ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**



యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

--------

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

**ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**
ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం.
భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా



నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది.
ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను (ూత్‌అ-ూఎవిఎవం/ూతీమ్ఘ ణవఅఋశ్రీ - ూ2/ూణ) పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ూ2/ూణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది.
ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది.
ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

# జిల్లా పోలీసు కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు ఏప్రిల్ 11:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సంధర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు ఎఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ కృష్ణ మోహన్ గారు కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం మహాత్మా పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎ ఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ కృష్ణ మోహన్ పేర్కొన్నారు. ఈ సంధర్భంగా పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది కలిసి మహాత్మా జ్యోతిబా పూలే గారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నారాయణ, పోతల రాజు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.ద

# ఇంటర్ డిస్టిక్ హాకి అండర్ 21 జూనియర్స్ బాలికల జట్టు ఎంపిక.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 11:**
హాకీ నంద్యాల డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్టిక్ హాకీ అండర్ 21 జూనియర్స్ బాలికల జట్టు ఎంపిక శనివారం హాకీ నంద్యాల జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించారు. ఎంపిక కాబడిన జట్టు ఈనెల 16వ తేదీ నుండి 18 వ తేదీ వరకు చిత్తూరులో రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారని హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, నంద్యాల జిల్లా కార్యదర్శి దివాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నంద్యాల ఎస్పీజీ క్రీడా మైదానంలో హాకీ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని అసోసియేషన్ ప్రతినిధులతో రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు వెటర్న్ హాకీ క్రీడాకారుడు సిరివెళ్ల విల్సన్ జెర్సీలను స్పాన్సర్ చేశారు. నంద్యాల జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్యరాజు, నంద్యాల జిల్లా కార్యదర్శి దివాకర్, కోచ్ శ్రావణ్ జెర్సీలను క్రీడాకారులకు బహుకరించారు.
హాకీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు, జిల్లా కార్యదర్శి దివాకర్, వెటరన్ క్రీడాకారుడు విల్సన్ మాట్లాడుతూ..నంద్యాల జిల్లాలకు హాకీలో మంచి గుర్తింపు తీసుకురావాలని, రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలని క్రీడాకారులను కోరారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. క్రీడలు శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని తెలిపారు. అలాగే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉద్యోగాలలో వారికి అవకాశాలు ఎంతో మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ హాకీ జట్టులో పాల్గొంటున్న నంద్యాల జిల్లా క్రీడాకారులందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీలలో పాల్గొని నంద్యాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెటర్న్ హాకీ క్రీడాకారులు కారు రవికుమార్, మిద్దె చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలిక హత్యపై చంద్రబాబు సీరియస్

## ఉన్మాదులను వదిలిపెట్టేది లేదని హెచ్చరిక



**అమరావతి, ఏప్రిల్ 11ఆంధ్ర ప్రగతి**
కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. శుక్రవారం బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది. దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేశ్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.